సుమంగళి



ఉత్తమ చిత్రాలు అరుదుగా తొలకరి మెరుపులా వస్తుంటాయి.
అటువంటి చిత్రాలలో పురుషుడు త్యాగిగా కన్పిస్తాడు.
స్త్రీ మహోన్నత త్యాగమూర్తిగా గోచరిస్తుంది.
భారతదేశంలో మాత్రమే కనిపించే ప్రేమ, త్యాగం వీటి అనుభూతులు ఇందులో
ఎంతో ఉదాత్తంగా చిత్రించబడ్డాయి.
ప్రేమ ఆనందశిఖరాలను అందుకొన్ననాడు,
యువతి ప్రేమకే చిహ్నమయిననాడు,
ఉన్నతాదర్శాలతో ప్రేమ, జీవితం మేళవించిననాడు,
సానుభూతిని త్యాగం జయించిననాడు,
కరుణామయ సంఘటనలు హృదయాలను కరిగించిననాడు,
భర్త చూపే సానుభూతిని అధిగమించగల త్యాగాన్ని భార్య చూపిననాడు.
జీవితంలో ఎలాంటి అనుభూతులు,
ఆదర్శాలు పెంపొందుతాయో ఈ చిత్రంలో చూస్తారు.
దర్శకుడు ఆదుర్తి, సంగీత దర్శకుడు మహదేవన్ అపూర్వ సమ్మేళనంతో,
నాగేశ్వరరావు, సావిత్రి నటనా చాతుర్యంతో,
నూతన పథంలో, కొత్త ధోరణి కథతో నిర్మించబడిన చిత్రం.

సుమంగళి

(12)

పాటలు

పాడినది : ఘంటసాల, సుశీల. రచన : ఆత్రేయ.

విశ్వం : ఇది మన భారతీయ శిల్పకళా వైభవము
ఇది మన ప్రాచీన నాగరికతా చిహ్నము
ఇది మానవతకే స్వర్ణయుగము....

విశ్వం : ఆనాటి మానవుడు ఏమి చేశాడు
ఈనాటి మానవుడు ఏమి చూశాడు
శిలలలో జీవకళ పోశాడు వాడు

శారద : జీవితాన్నే కళగ చేశాడు వీడు ॥ఆనాటి॥

విశ్వం : మంచినే ఎంచి - మనసునే పెంచి
మనిషి దేవుడుగా మారజూశాడు

శారద : నాతి అందాలన్ని రాతిలో చెక్కాడు
తీరని కోరికలె తీర్చుకున్నాడేమో ॥ఆనాటి॥

విశ్వం : మానవుల కన్నీరు మాన్పగా నెంచి
మహరాజు భిక్షువై బయలుదేరాడు

కోరస్.... బుద్ధం శరణం గచ్ఛామి.... ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి....

శారద : మనసు నిచ్చిన మగువ మమత కన్నీరుగా
పారించి అడవులకు పారిపోయాడు ॥ఆనాటి॥

పాడినది : ఘంటసాల . సుశీల   రచన : ఆత్రేయ

శారద : కనులు కనులతో కలబడితే ఆ
తగవుకు ఫల మేమి ?

విశ్వం : కలతే

శారద : నా కలలో నీవే కనబడితే ఆ
చొరవకు బలమేమి

విశ్వం : మరులే

శారద : మరులు మనసులో స్థిరపడితే ఆ
పై జరిగేదేమి ?

విశ్వం : మనువు

శారద : మనువై ఇద్దరు ఒకటైతే ఆ
మనుగడ పేరేమి ?

విశ్వం : సంసారం ॥కనులు॥

శారద అల్లరి ఏదో చేసితిని
చల్లగ ఎదనే దోచితివి

విశ్వం : ఏమీ లేని పేదనని
నాపై మోపకు నేరాన్ని

శారద : లేదు ప్రేమకు పేదరికం
కోరను నిన్ను ఇల్లరికం

విశ్వం : నింగి నేలకు కడుదూరం
మన ఇద్దరి కలయిక విడ్డూరం ॥కనులు॥

పాడినది: ఘంటసాల, సుశీల. రచన: ఆత్రేయ

శారద: ఏనాటికైనా – ఏ జన్మకైనా
నీ తోడు వీడగ – నీ చేయి వీడక
నీ అడుగు జాడలే – అనుసరిస్తాను

విశ్వం: కన్నులు నీవే కావాలి
కలనై నేనే రావాలి

శారద: కవితే నీవై వురకాలి
కావ్యం నేనై నిలవాలి ॥కన్ను॥

శారద: మనసు నేనై వుండాలి
మమత నీవై నిండాలి

విశ్వం: కడలి నేనై పొంగాలి
నదివి నీవై చేరాలి
నదివి నీవై చేరాలి ॥కన్ను॥

విశ్వం: తొలకరి నీవై చిలకాలి
మొలకను నేనై మొలవాలి

శారద: దైవం నీవై నడవాలి
ధర్మం నేనై నడవాలి
ధర్మం నేనై నడవాలి ॥కన్ను॥

విశ్వం: శిల్పం నీవై కల్పన నేనై
చిరకాలం జీవించాలి

శారద: చెఱగని మారని శిలాక్షరాలై
చిరంజీవులం కావాలి ॥కన్ను॥

పాడినది : జమునారాణి
యల్. ఆర్. ఈశ్వరి.
వసంత. స్వర్ణలత.

రచన : ఆత్రేయ

కొత్త పెళ్ళికూతురా రా రా
నీ కుడికాలు ముందుమోపి రా రా
కులసతి గుణవతి రా రా
నువు కోరుకున్న కోవెలకు రా రా ॥కొత్త॥

కలిమికి కాణాచి నీ పుట్టినిల్లు
చెలిమికి మాగాణి నీ మెట్టినిల్లు
ధనమున్నది బలమున్నది నీ ఇంట
మనసున్నది మమతున్నది మా ఇంట ॥కొత్త॥

పై మెరుగులు పై డినగలు లేవు ఇక్కడ
పంతాలు సాధింపులు రావు ఇక్కడ
నిండుమనసు చిరునగవు పండు నిక్కడ - ఆ
పండువెన్నెలందు దినం పండు గిక్కడ ॥కొత్త॥

కన్నతల్లి కన్న మిన్న నీ అత్తగారు
కనుపించే దైవము చేకొన్నవాడు
కలలన్నీ నిజమౌ నీ కాపురాన
కలకాలం వెలుగు నీ ఇంటిదీపము ॥కొత్త॥

పాడినది : ఘంటసాల రచన : ఆత్రేయ

విశ్వం :

వలపువలె తీయగా

వచ్చినావు నిండుగా

మెఱుపువలె తళుకుమని

మెఱసిపోయె టందుకా ॥వలపు॥

తడబడు నడకల నడచినపుడు నీ

తత్తరపాటును చూడాలి

తలుపు మూయగనె దారులువెదకే

బిత్తర చూపులు చూడాలి

అని తలచి తలచి ఈ తరుణంకోసం

తపసుచేసినది ఇందులకా ॥వలపు॥

మురిపెములొలికె ముద్దుమోమును

కురుల మబ్బులో దాచుటకా

మిసమిసలాడే నొసటి కుంకుమ

చిరుచెమటలలో కరగుటకా

ఎదనుతెఱచి నేనిన్నినాళ్లగా

ఎదురుచూచినది ఇందులకా ॥వల

పాడినది : పి. బి. శ్రీనివాస్, జానకి   రచన : ఆత్రేయ

అతడు : ఏవేవో చిలిపి తలపు లురుకుతున్నవి
అవి ఎలా ఎలా చెప్పాలో తెలియకున్నది
ఏవేవో....

ఆమె : ఏవేవో వలపు తలపు లురుకుతున్నవి
అవి ఎలా ఎలా చెప్పాలో తెలియకున్నది
ఏవేవో....

అతడు : కురులలోన మల్లెపూలు కులుకుచున్నవి
అరవిరిసిన పడుచుతనం పిలుచుచున్నది

ఆమె : మరపురాని తొలిరేయి మరల రానిది
మగువ జీవితాన ఇదే మధురమన్నది ॥ఏవేవో॥

అతడు : ఒక్క క్షణం

ఆమె : ఆ హా హా

అతడు : ఒక్క క్షణం జారిపోతె దక్క దన్నది
కాలానికి బిగి కౌగిలి కళ్ళె మన్నది

ఆమె : కన్నె మనసు ఏవేవో కలలు కన్నది
ఆ కలల రూపు ఈ రేయే కాంచనున్నది

అతడు : ఆ హా !

ఆమె : ఓ హో ! ॥ఏవేవో॥

అతడు : తీయనైన తలపు లేవో ముసురుకొన్నవి
తీసియున్న తలుపులను మూయమన్నది

ఆమె : మనసుతోటి తనువుకూడ నీది కానున్నది
మనుగడ ఈ నాటితో మనది కానున్నది ॥ఏవేవో॥

పాడినది : ఘంటసాల

రచన . ఆత్రేయ

విశ్వం : సిగలోకి విరులిచ్చి
చెలినొసట తిలకమిడి
సిగపూవు వాడకనే
చెలిబ్రతుకు వాడెనయ్యా
పరువానికి బలవంతాన
పగ్గాలే వేస్తావా
మనసుమూసి మమతలు రోసి
మనుగడ మసి చేస్తావా
తనువు చిక్కి శల్యంబైనా
వలపులణిగి పోయేనా
ఇరవైలో అరవై వయసు
ఎవరికైన వచ్చేనా
ఎవరికైన వచ్చేనా ॥సిగ॥

తీయనైన జీవితాన
చేదువిషం తాగేవా
తోడునీడగా ఒకరుండి
ఏకాకిగ బ్రతికేవా
కోరినది చేతికిచిక్కి
ఆరుతున్నదొక దీపం
కోరినది చేతికిరాక
ఆరకున్నదొక తాపం
ఆరకున్నదొక తాపం ॥సిగ॥

అంధుని ఎదుట అందాలేలా
అడవిని పున్నమి వెన్నెలలేలా
అసమర్థున కవకాశాలేలా
వృథా....వృథా....ఈ బ్రతుకు వృథా ....

సాంకేతిక నిపుణులు :

కథ : కె. ఎస్ గోపాలకృష్ణ

మాటలు, పాటలు : ఆచార్య ఆత్రేయ

సంగీతం : కె. వి. మహాదేవన్

నృత్యం : వి. ఎస్. గోపాలకృష్ణ

కళ : జి. వి. సుబ్బారావు, బి. ఏ.

సాంగ్స్ రికార్డింగ్ వి. శివరాం, బి. ఏ., బి. ఎస్‌సి.

రీ-రికార్డింగ్ : W. నరసింహమూర్తి. ఎల్.సి. అండ్ ఎస్.ఇ.

మాటలు : జి. జి. కె. గోఖలే

ఔట్ డోర్ : రామచంద్రరావు

ఎడిటింగ్ : టి. కృష్ణ, బి. ఏ.

ఫొటోగ్రఫీ : ఏ. ఎల్. రాయ్

కెమెరా : కె. ఎస్. రామకృష్ణరావు, ఎల్.సి. అండ్ ఎస్.ఇ.

ప్రాసెసింగ్ : ఎస్. రాజన్న

స్టూడియో : శ్రీ సారథి

నిర్మాణ నిర్వహణ : టి. ఎస్. బాలు

సహాయ దర్శకుడు : ఘంటసాల చిరంజీవి

సహకార దర్శకుడు : జి. కబీర్ దాస్

ఎసోసియేట్ ప్రొడ్యూసర్ :
టి. వి. ఎస్. శాస్త్రి

దర్శకుడు :
ఆదుర్తి సుబ్బారావు

నిర్మాత :
టి. గోవిందరాజన్

'స్వతంత్ర', విజయవాడ - 4.

వెల: 10 పైసలు

వీనస్ పిక్చర్స్ సమర్పించు అశోక్ మూవీస్

సుమంగళి

దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు

నిర్మాత గోవిందరాజన్

రచన ఆత్రేయ

సంగీతం మహదేవన్

స్టూడియో శ్రీ సారథి

నవయుగ విడుదల



డిస్ట్రిబ్యూటర్సు :

అనిల్ ప్రకాష్ ఎంటర్ ప్రైజెస్.